కొండవాలుపై నివాసం.. సమస్యలతో సహవాసం



కొండపై నివాసులు వినియోగిస్తున్న మట్టి రోడ్డు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్ నగర్ కొండవాలు ప్రాంతం ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదు. కనీస సదుపాయాలు కరువవడంతో కొండవాలు వాసులు అనేక సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు నేటికీ మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నారు. వీధి కాలువలు లేక సొంతంగా గోతులు తవ్వుకుని వాటినే వ్యర్థపు నీరు పోయే మార్గాలుగా వినియోగించుకుంటున్నారు. రక్షణ గోడ నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోవడంతో ఇక్కడ కొన్ని ఇళ్లు ప్రమాదపు అంచున ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఇన్ని సమస్యలు నెలకొన్నా.. నేటికీ పాలకులు, అధికారులు స్పందించకపోవడం బాధాకరం.

ప్రమాదపుటంచున ఇళ్లు

హనుమాన్‌నగర్ కొండవాలు ప్రాంతంలో సుమారు 200 మంది వరకు ప్రజలు జీవిస్తున్నారు. వీరంతా రోజు కూలీలు కావడంతో నిత్యం రెండు మూడు సార్లు కొండ ఎక్కి దిగాల్సి ఉంటుంది. జీవీఎంసీ పరిధిలో ఈ ప్రాంతం ఉన్నప్పటికీ ఇక్కడ వీధి కాలువలు, సీసీ రోడ్లు ఏవీ లేవు. నివాసులు మట్టి రోడ్డుపై రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి. వర్షాలకు ఇక్కడ మట్టి చరియలు విరిగిపడుతున్నాయి.

అభివృద్ధికి దూరంగా హనుమాన్ నగర్

- నేటికీ మట్టి రోడ్లే.. కానరాని కాలువలు
- పూర్తికాని రక్షణ గోడ పనులు
- పట్టించుకోవాలని నివాసుల విజ్ఞప్తి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఈ ప్రాంతంలో సుమారు 50 మీటర్ల వరకు రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టారు. వారి పాలన కాలం ముగియడంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సుమారు 40 మీటర్ల వరకు రక్షణ గోడ నిర్మాణ పనులు జరగాల్సి ఉంది. నేటికీ ఈ పనులు ముందుకు సాగలేదు. నిర్మాణం జరగని రక్షణ గోడ ప్రాంతంలో సుమారు 20 ఇళ్ల వరకు ప్రమాదపు అంచున ఉన్నాయి. వారు నిత్యం బిక్కు బిక్కుమంటూ జీవిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి తమ ప్రాంత సమస్యలను తక్షణం పరిష్కరించాలని హనుమాన్‌నగర్ వాసులు కోరుతున్నారు.



వీధి కాలువలు లేని హనుమాన్ నగర్



ప్రమాదపుటంచున హనుమాన్ నగర్ కొండవాలు ప్రాంతం

ఇబ్బందులు పడుతున్నాం

15 ఏళ్ల నుంచి హనుమాన్‌నగర్ కొండ ప్రాంతంలో నివసిస్తున్నాం. మేము ఉండే ప్రాంతంలో అధికారులు రక్షణ గోడ నిర్మాణ పనులు చేపట్టలేదు. ప్రమాదపుటంచున మా ఇళ్లు ఉన్నాయి. కాలువలు లేవు. మట్టి రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తున్నాం. ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.

– గణేష్, హనుమాన్ నగర్

సమస్యలు పరిష్కరించాలి

మా ప్రాంతంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు అధికారులకు వినతిపత్రాల ద్వారా గ్రామ పెద్దలు వివరించారు. నేటికీ స్పందన లేదు. మట్టి రోడ్డుపై తిరగలేకపోతున్నాం. కాలువలు లేక తిప్పలు తప్పడం లేదు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి.

– మహాలక్ష్మి, స్థానికురాలు

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మల్కాపురం: శ్రీహరిపురం విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని 11కేవీ పిలకవానిపాలెం ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంటుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పిలకవానిపాలెం,అన్నపూర్ణ నగర్, ఉప్పర కాలనీ, శ్రీరామ్‌నగర్, గొందేశివానిపాలెం, కోడిపందాలదిబ్బ, శ్రీనివాస్‌నగర్, గుల్లలపాలెం,రామ్‌నగర్,కుంచమ్మకాలనీ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

కొత్తపాలెం సబ్ స్టేషన్‌లో..

గోపాలపట్నం: కొత్తపాలెం సబ్ స్టేషన్ పరిధిలో పాతగోపాలపట్నం ఫీడ్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి. సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సింహాచలం రైల్వే స్టేషన్ ప్రాంతం, పాతగోపాలపట్నం, ఎర్ర చెరువు, గణేష్‌నగర్ తదితర ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని.. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

భవనంపై నుంచి జారిపడి పెయింటర్ మృతి

కూర్మన్నపాలెం: భవనానికి పెయింటింగ్ చేస్తుండగా జారిపడి ఒక వ్యక్తి మృతి చెందాడు. మల్కాపురానికి చెందిన ఎ.రామకృష్ణ(55) ఈ ప్రమాదంలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గల్లవానిపాలెంలో గ్రూపు హౌస్‌కు రామకృష్ణ పెయింటింగ్ వేస్తుండగా జారి పడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి మానవహారం నేడు

మత్రిపాలెం: ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని దేశవ్యాప్తంగా అఖిల భారత అంగన్‌వాడీ యూనియన్ బ్లాక్‌డే నిర్వహిస్తున్నట్టు ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ యూనియన్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం 5 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యాప్ భారం తగ్గించాలని కోరుతూ మానవహారం చేపడుతున్నట్లు చెప్పారు. పెద్ద ఎత్తున అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొంటారన్నారు.

అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న మాలినాయుడు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురంలో మురళీ కృష్ణయాదవ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనను వార్డు నాయకుడు మజ్జి మాలినాయుడు ప్రారంభించి భక్తులు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో దొప్ప సన్యాసిరావు, మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు, నీలంరాజు, మురళీకృష్ణ యాదవ్ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

23న సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు

సీతంపేట: సివిల్ సర్వీసెస్ పరీక్ష ప్రిపరేషన్‌పై ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ద్వారకా నగర్ పౌర గ్రంథాలయంలో ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఏకం ఐఏఎస్ అకాడమీ సంస్థ ప్రతినిధి శశి ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ సర్వీసెస్ వైపు అడుగులు వేస్తున్న విద్యార్థులకు మార్గదర్శకం చేయడానికి, సందేహాల నివృత్తికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రిటైర్డ్ మేజర్ ఎస్‌పీఎస్ ఒబెరాయ్ ముఖ్య అతిథిగా పాల్గొని సివిల్ సర్వీసెస్‌కు ఎలా ప్రిపేర్ అవ్వాలి, యూపీఎస్సీ పరీక్షా విధానం, టైం మేనేజ్‌మెంట్, రివిజన్ పద్ధతులు, ప్రస్తుత వ్యవహారాల ప్రాముఖ్యత, విజయానికి కావలసిన మైండ్ సెట్ తదితర విషయాలపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు సదస్సుకు హాజరు కావచ్చన్నారు. విద్యార్థులు 81210 27337 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

విశాఖ విద్య: విద్యార్థులు చదువుతోపాటు సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఏయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు సూచించారు. వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ విద్యార్థులు బమ్మిడి రజిని, వనం కళ్యాణ్ యూనివర్సిటీ లెవెల్ బెస్ట్ ఎన్ఎస్ఎస్ వలంటీర్స్‌గా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నరసింహారావు, విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, జాతీయ సేవా పథకం పోగ్రామ్ అధికారి బోరుగడ్డ సుబ్బయ్య అవార్డు అందుకున్న వలంటీర్స్‌ను అభినందించి సన్మానించారు. ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ ఆర్ట్స్ కాలేజీకు అవార్డులు రావడం చాలా సంతోషకరమన్నారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అంటేనే సేవా భావంతో ఉంటారని తెలియజేశారు. ప్రొఫెసర్ జాలాది రవి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ యూనిట్‌ను ప్రారంభించిన తర్వాత యూనివర్సిటీలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, వీరికి అవార్డులు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రోగ్రాం అధికారి బోరుగడ్డ సుబ్బయ్య మాట్లాడుతూ అవార్డు అందుకున్న విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగే అడ్వెంచర్ క్యాంప్, కల్చరల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ వంటి వివిధ పోటీల్లో పాల్గొని ఎన్నో పతాకాలు సాధించారన్నారు. వారికి అవార్డులు రావడం కాలేజీకి గర్వకారణమన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఆచార్య నరసింహారావు

గజల్ ప్రక్రియలో రచనలు రావాలి

సీతంపేట: గజల్ ప్రక్రియను తెలుగులో మొట్టమొదట దాశరథి ప్రారంభించారని గజల్ కవి, కథా రచయిత చల్లా రాంబాబు అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో బుధవారం జరిగిన గజల్ మాధురి కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా ప్రసంగించారు. గజల్ ప్రక్రియ అరబిక్ పర్షియా ఉర్దూ భాషల నుంచి తెలుగులోకి ఎలా పరిణామక్రమం చెందిందో వివరించారు. తెలుగులో గజల్ ప్రక్రియను దాశరథి ప్రారంభించారని, తర్వాత సి.నారాయణరెడ్డి సామాజికాంశాలతో రచించి విస్తృత పరిచారన్నారు. నారాయణరెడ్డి తర్వాత తెలుగులో గజల్స్ తానే రాశానని తెలిపారు. ఈ ప్రక్రియలో రచనలు మరిన్ని రావాలని, గజల్స్ రాయాలన్న ఔత్సాహికులు తనని సంప్రదించవచ్చన్నారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఉర్దూ కవిత్వంలో గజల్ రచనా పద్ధతి వందేళ్ల క్రితం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో కవులు సిహెచ్.చినసూర్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి, బి.రాధారాణి, కుప్పిలి భీమేశ్వరరావు, కొత్తూరు రమణ, పరమేశ్వరరావు, శివాజీ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న గజల్ కవి చల్లా రాంబాబు

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం ఇద్దరు దాతలు విరాళాలు అందజేశారు. నగరంలోని ఆశీల్‌మెట్టకు చెందిన వరద కమలాకర్, అపర్ణ దంపతులు రూ.లక్ష 11వేల 116, విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన నరసింహ విశ్వనాథరాజు, గుణమణిదేవి దంపతులు లక్ష 116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో సంబంధిత విరాళాన్ని వారు బుధవారం నగదు రూపంలో చెల్లించారు. దాత విశ్వనాథరాజు దంపతులకు ఈవో వి.త్రినాథరావు, కమలాకర్ దంపతులకు డిప్యూటీ ఈవో సింగం రాధ బాండ్‌లను అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.



దాత కమలాకర్‌కు బాండ్ అందజేస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సీపీఐ మహాసభలు జయప్రదం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: ఒంగోలులో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహా సభల్లో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వేపగుంట కూడలి వద్ద చిరువ్యాపారులతో కలిసి బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను, ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చేయాల్సిన పోరాటం గురించి మహాసభల్లో చర్చిస్తామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది ప్రతినిధుల సమక్షంలో పలు తీర్మానాలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో వై.రాంబాబు, చిరు వ్యాపారులు శ్రీను, గౌరీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనుకూలాంశాలతోనే ఉత్పత్తి నాణ్యత

మురళీనగర్: వస్తువుల రూపకల్పనలో (డిజైన్) అనుకూలాంశాలు కీలకమని ల్యాబ్‌కార్ప్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున్ కొరిపాడు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'డిజైన్ ఫర్ మాన్యుఫాక్చరబిలిటీ అండ్ డిజైన్ ఫర్ అసెంబ్లీ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. వస్తువుల రూపకల్పన దశలోనే సమస్యలను గుర్తించడం ద్వారా తక్కువ ఖర్చుతో, నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయవచ్చని వివరించారు. అనంతరం గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రేమ్ కుమార్ సింగ్ 'డిజైన్ అండ్ థింకింగ్ అండ్ ఇట్స్ మ్యాథమెటికల్ మోడలింగ్' అనే అంశంపై మాట్లాడారు. గణిత మోడలింగ్ సహాయంతో సంఖ్యాత్మక సమస్యలను గుర్తించి, వాటిని సమన్వయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ డాక్టర్ పి.ఎం.భాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్, కో-కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ రాజు, ఎం.భరణి పాల్గొన్నారు.

సిరులతల్లికి పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం 27వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు.

98.86 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు

మహారాణిపేట: నులిపురుగుల నివారణలో భాగంగా బుధవారం మాపప్ రౌండ్ నిర్వహించారు. బర్మా క్యాంప్, భానోజీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, జైభారత్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు చేతుల మీదుగా నులిపురుగుల నివారణ మాత్రలను మింగించారు. ఇక్కడ ఈ నెల 12న 18 మంది చిన్నారుల్లో 16 మంది వేసుకోగా.. బుధవారం మిగిలిన ఇద్దరు చిన్నారులకు మాత్రలు వేశారు. జిల్లాలో 1 నుంచి 19 ఏళ్ల వయసు గల బాలబాలికలు 5,15,264 మంది ఉండగా.. ఇప్పటి వరకు 5,14,544 మంది చిన్నారులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను మింగించారు. ఈ మాపప్ రౌండ్‌లో 1.87 శాతం మంది పిల్లలకు మాత్రలు వేశారు. దీంతో జిల్లాలో మొత్తం 98.86 శాతం మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసినట్టు డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి బి.నాగేశ్వరరావు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.



చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

అర్హులకు టిడ్కో ఇళ్లు అందించాలి

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి అచ్చెంనాయుడులోవలో నిర్మించిన 5000 పైగా టిడ్కో ఇళ్లను, అదే విధంగా జీవీఎంసీ 58వ వార్డు పరిధి ములగాడలో 3000 పైగా టిడ్కో ఇళ్లను వెంటనే అర్హులకు అందజేయాలని, లేదంటే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని సీపీఐ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం అచ్చెంనాయుడులోవ, ములగాడలో ఉన్న టిడ్కో ఇళ్లను సందర్శించారు. వెంటనే అర్హులైన పేదలందరికీ గృహాలను అందజేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలకు మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. వెంటనే గృహాలు అందజేయాలని,లేదంటే తామే మరో 2 నెలల్లో అర్హులను గుర్తించి ఇళ్లను అందజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పశ్చిమ నియోజకవర్గ కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ, సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చెంనాయుడులోవలో టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న కంచరపాలెం సీఐ రవికుమార్

మత్రిపాలెం: బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవికుమార్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం పలు ప్రధాన కూడళ్లలో సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. తాటిచెట్లపాలెం జంక్షన్ వద్ద బహిరంగంగా మద్యం తాగిన వారిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని, ప్రజల భద్రతను దృష్టిలో పెట్టుకుని నేరాల నియంత్రణ కోసమే విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఎవరైనా అనుమానితులను గుర్తించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని స్థానికులను కోరారు. అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని సీఐ హెచ్చరించారు. నిత్యం సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు.

గణనాథులు సిద్ధం

- వినాయక ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరం
- వాడవాడలా వెలుస్తున్న పందిళ్లు



రంగులు దిద్దుకుంటున్న వినాయకుడు

కంచరపాలెం: వినాయక ఉత్సవాలకు అంతా సిద్ధమవుతున్నారు. ప్రతిమలకు కళాకారులు తుది రూపు ఇస్తున్నారు. ఉత్సవకమిటీలు ఇప్పటికే బొమ్మలకు ఆర్డర్లు ఇచ్చాయి. ఉత్సవ రాటలు వేయడంతో పాటు మండపాల ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. మరో వైపు పర్యావరణ హితంగా గణపతి నవరాత్రులను చేసుకోవాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. అందుకు అణుగుణంగానే ఈ ఏడాది భారీగా మట్టి విగ్రహాలను సిద్ధ చేశారు.ఈ నెల 27న వినాయక చవితి పురస్కరించుకుని నగరంలో పలు చోట్ల సేవా సంఘాల ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



భారీ మట్టి గణపతి

పర్యావరణానికి ఉపయోగకరంగా..

వాతావరణం కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు తాము సైతం సిద్ధమంటున్నారు విగ్రహాల తయారీదారులు. కోల్‌కతా, ఒడిశా నుంచి వలస వచ్చిన కొంత మంది కళాకారులు కంచరపాలెం పరిధిలోని పరమేశ్వరి థియేటర్ ఆవరణ, మళ్లసూరివీధి, ధర్మానగర్, రామ్మూర్తిపంతులపేట, 104 ఏరియా, పైడిమాంబకాలనీ, జ్ఞానాపురం, తదితర ప్రాంతాల్లో ఈ ఏడాది కేవలం మట్టితో విగ్రహాలు తయారు చేస్తున్నారు. రసాయనాలు లేని సహజ రంగులను మాత్రమే ఉపయోగిస్తున్నారు.



చవితి వేడుకలకు సిద్ధమైన గణపతులు



పలు రకాల మట్టి విగ్రహాలు

ఆకర్షణీయంగా..

భక్తులను ఆకర్షించే వివిధంగా విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. మాములుగా వినాయక విగ్రహాలను వైట్ సిమెంట్ అచ్చుల్లో వేసి తయారు చేస్తారు. కాని వీరు చేతితోనే విభిన్న ఆకారాల్లో మట్టి విగ్రహాలను తయారు చేయడం విశేషం. కర్రలు, ఎండు గడ్డి, బంకమన్ను, సాధారణ రంగులు, దుస్తులతో తయారు చేసిన ప్రతిమలు కూడా కట్టిపడేస్తున్నాయి. వీటిని చూసిన వారు కళాకారుల సృజనాత్మకతను అభినందిస్తున్నారు.

సత్యానగర్ కొండవాలులో జెడ్సీ పర్యటన

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డు కొండవాలు ప్రాంతం సత్యానగర్‌లో బుధవారం జోన్-5 కమిషనర్ రాము పర్యటించారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతంలో గోడ కూలి కొండచరియలు విరిగి పడిన విషయం తెలుసుకున్న ఆయన పోలీసు అధికారులతో కలిసి సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. గోడ కూలిన ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.